# ★ ఘరానామనిషికి అమర్యాద ★

చోడవరపు బాబూరావు

ఆబాలగోపాలమూ ఆ సాయంత్రమయేసరికి పూరుబయట మైదానం దగ్గర గుమిగూడటం మొదలెట్టారు. అంతా ఆశ్చర్యంగా ఒకర్నొకరు ప్రశ్నించుకోవటమే. అంత ఆశ్చర్యానికి కారణం ఏమిటీ అంటే, 'బ్లాక్ మార్కెట్ దార్లను పట్టి ప్రభుత్వానికి వప్పగించిన వాళ్ళకు బహుమతీ యిస్తాం' అని ప్రభుత్వం ప్రకటించిన మర్నాడే, ఎవరో ఒకమనిషి తాను ఒక ప్రముఖ బ్లాక్ మార్కెట్ దారుని యెరిగి వున్నాననీ, అతణ్ణి బయట పెడతాననీ రిపోర్టు యిచ్చాడట. అట్లా రిపోర్టుయిచ్చి నతను ఎవరో కాదు, సామాన్యుడే నట. పట్టణంలో ఘరానామనుషు లందర్నీ ఓవరసలో నుంచోబెడితే ఆ బ్లాక్ మార్కెట్ దారుని పట్టుకుంటాడట. ఆ వింత చూడటానికీ, ఆ ప్రఖ్యాత బ్లాక్ మార్కెట్ దారుని సందర్శించి పోవటానికే యీ విధంగా జనం రావటం.

అయితే, ప్రభుత్వం సామాన్యుడికి ఒక్క షరతు పెట్టింది. ఆ పట్టుపడ్డవాడు ఎవరో పెద్ద మనిషీ, ఏమీ యెరగనివాడూ అయితే సామాన్యుడికే శిక్ష విధిస్తాము-అని.

ఘరానా మనుషులందర్నీ వరసగా నుంచో బెట్టారు. సామాన్యుడి తెలివితక్కువకి జనమంతా నవ్వటం మొదలెట్టారు. ఎందుచేతనంటే ఆ ఘరానా మనుషుల్లో అంతా ఖద్దరువారు. వీళ్లలో బ్లాక్ మార్కెట్ దారు వుంటాడంటే నవ్వురాక మరేమిటి? పైగా అందరూ ఖద్దరుటోపీలు ధరించినవాళ్లూ, మంచి పలుకుబడి వున్నవాళ్లూనూ! 'బ్లాక్ మార్కెట్టుదారు వీళ్ళలో వుంటాడు' అనటంకంటే తెలివి తక్కువ ఇంకేమిటి?

సామాన్యుణ్ణి తీసుకువెళ్ళి ఘరానామనుషుల ముందరనిలబెట్టి, 'ఏదీ, బ్లాక్ మార్కెట్టుదారుని చూపించు' అన్నది ప్రభుత్వం. 'అహింసా పరమో ధర్మః' అనే అక్షరాలు చెక్కివున్న లాఠీని సవరిస్తూ, సామాన్యుడికి శిక్షతప్పదని అందరూ నిర్ణయం చేసుకున్నారు.

సామాన్యుడు సరాసరివెళ్లి వరసలో నుంచున్న వాళ్ళలో ఒక 'ఘరానామనిషి'ని చూపించాడు. అంతా నిర్ఘాంతపోయారు.

'సామాన్యుడికి మతి భ్రమించిం'దని కొందరూ, 'తాగివచ్చా'డని కొందరూ తలోవిధంగానూ అనుకున్నారు. అంతకంటె యేమనుకుంటారు మరి? ఆ పట్టుబడ్డ వ్యక్తి నఖశిఖపర్యంతమూ ఖద్దరు ధరించాడాయెను! చివరకు చొక్కాగుండీలమీద కూడా త్రివర్ణపతాకమే వుందాయెను!

'పట్టుకోండి సామాన్యుణ్ణి' అంది ప్రభుత్వం. వెంటనే సీలమండలమీదా, చేతిముడుకులమీదా నాలుగులాఠీలు వచ్చిపడ్డాయి. 'బాబోయ్! కావాలంటే ఋజువుచేస్తానండోయ్!' అంటున్నాడు సామాన్యుడు.

'సోదరులారా! చూశారా! నేను ఋజువు వున్నది అంటున్నా ప్రభుత్వం నమ్మటంలేదు. మీకందరకూ ఇది అన్యాయంగా తోచటం లేదా?' అని ప్రజల్నుద్దేశించి మొరపెట్టుకున్నాడు సామాన్యుడు.

'అవును, శుద్ధఅన్యాయం. సామాన్యుణ్ణి వెంటనే విడిచిపెట్టాలి, బ్లాక్ మార్కెట్టుదారుని బంధించాలి' అన్నారు, ప్రజలంతా ఒక్కసారిగా.

'ప్రజల్లోకూడా ప్రచారం సాగిస్తున్నాడు. చూస్తారేం?' అన్నాడు అధికారి. ప్రజారక్షణ కోసం ప్రజలందరి సీలమండలమీదా లాఠీలు మ్రోగినై. ప్రజలు నాలుగు మూలలా చెదిరి పోయారు.

'నోరు ముయ్యరా' అంటూ సామాన్యుడి రెండు దవడలమీదా లెంపకాయలు మోగినై.

సామాన్యుడు నోరుమూద్దా మనుకుం టుండగానే నోట్లోపళ్లు కొన్నీ కింద పడిపోయినై.

“'ఘరానామనిషి'ని 'అవమానించి' నందుకు సామాన్యుడికి ఆరునెలలు ఖైదూ, ఆరువందల రూపాయిల జుల్మానా 'బహుమతి' యివ్వటమైంది” అని ఆమర్నాడు పత్రికల్లో వార్త.